హై టెన్షన్!

- అప్పట్లో వ్యవసాయ భూముల్లో ఏర్పాటు
- ప్రస్తుతం జనావాసాల మధ్యలోకి..
- రాకపోకలతో నిత్యం ప్రమాదాలు
- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న హైటెన్షన్ లైన్




మల్లికార్జుననగర్‌లో హైటెన్షన్ లైన్‌లో ఒక వైపు పార్కింగ్.. మరో వైపు రాకపోకలు




కళింగ ఎన్‌క్లేవ్ దారిలో రోడ్డు మధ్యలో హైటెన్షన్ స్తంభాలు



భాగ్యశ్రీ గార్డెన్ లైన్‌లో..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ దశాబ్దాల క్రితం వ్యవసాయ భూములతో పచ్చగా ఉండేది. ఆరు దశాబ్దాల క్రితం ఈ వ్యవసాయ భూముల్లో హైటెన్షన్ లైన్‌లు ఏర్పాటు చేశారు. నగరం విస్తరించడంతో ఇక్కడి వ్యవసాయ భూములు కనుమరుగై కాలనీలుగా మారాయి. ప్రస్తుతం ఈ హైటెన్షన్ లైన్లు జనవాసాల మధ్యలో.. రహదారులకు నట్టనడుమ ఉన్నాయి. రోడ్ల మధ్యలో ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇళ్ల మీది నుంచి హైటెన్షన్ వైర్లు వెళ్తుండటంతో ఇంటికి మరో ఫ్లోర్ వేసుకోలేకపోతున్నారు. ఇంటిపైకి వెళ్లితే తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటం అక్కడి వారిని కలవరపెడుతోంది.

◆ డివిజన్‌లో అతి పొడవైన ఈ హైటెన్షన్ లైన్ ఎంఎంఆర్ గార్డెన్ నుంచి మొదలై కళింగ ఎన్‌క్లేవ్, మల్లికార్జుననగర్ కాలనీ, భాగ్యశ్రీ గార్డెన్, ఎల్‌బీనగర్, మనసా సరోవర్ హైట్స్ నుంచి తిరుమలగిరి వరకు ఉంది. ఇంత పెద్ద హైటెన్షన్ లైన్ ఉండటంతో హైటెన్షన్ లైన్ మార్చుతారా లేక ఇలాగే వదిలేస్తారా తెలియక ఆందోళన చెందుతున్నారు. హైటెన్షన్ లైన్‌ను మార్చితే బాగుంటుందని పరిసర కాలనీల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు మారినా హైటెన్షన్ లైన్ మార్పు జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ గతంలో స్కూల్ వ్యాన్ హైటెన్షన్ హైటెన్షన్ స్తంభానికి ఢీకొట్టడంతో ముగ్గురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలాంటి ఘటనలు తరచూ పునరావృతమవుతున్నాయి. పెద్ద వాహనాలు వస్తే ఒకటి ఆగితే మరొకటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు హైటెన్షన్ లైన్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు.

మంత్రి కేటీఆర్ దృష్టికి...

గత డిసెంబర్ 2వ తేదీన ఆర్ఆర్‌నగర్ నుంచి అలీ కాంప్లెక్స్ వరకు నిర్మించే బాక్స్ డ్రేనేజీ పనులను ప్రారంభించేందుకు వచ్చిన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన హైటెన్షన్ లైన్ మార్పునకు తీసుకోవాల్సిన చర్యలపై తగిన ప్రాణాళికను రూపొందించాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ

తొలిమెట్టు రాష్ట్రస్థాయి సహకార పర్యవేక్షణ బృందం



తొలిమెట్టు వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్రస్థాయి సహకార పర్యవేక్షణ బృందం సభ్యులు

కూకట్‌పల్లి: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమాల అమలును పర్యవేక్షించడానికి రాష్ట్రస్థాయి సహకార పర్యవేక్షణ బృందం మంగళవారం కూకట్‌పల్లి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శంషీగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. బృందానికి నాయకత్వం వహించిన ఎస్సీఆర్‌టీ నుంచి వచ్చిన స్టేట్ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్, బృంద సభ్యులు వెంకటేశ్వరు, హరికృష్ణ, నీరజ, రాష్ట్ర రీసోర్సు గ్రూపు సభ్యులు సురేష్ పాఠశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. మార్కులు నమోదు చేసే విధానం, ప్రత్యేక తరగతి సమయంలో విద్యార్థులకు అందించే స్నాక్స్ వంటి అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

◆ అదే విధంగా ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాల తీరుతెన్నులు... విద్యార్థుల అభ్యాసన ఫలితాల సాధన వంటి విషయాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని వారు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ అంశాలను పూర్తిగా అవగతం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులందరూ మంచి జీపీఏతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ రవీందర్‌రాజు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడిపై దాడిని ఖండిస్తున్నాం



టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: యూత్ కాంగ్రెస్ కార్యకర్త తోట పవన్‌పైన జరిగిన దాడిపి తీవ్రంగా ఖండిస్తున్నానని టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల మీద దాడులు చేయటం కుట్రపూరితమన్నారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ గూండాల పాశవిక దాడిలో పవన్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. ప్రశ్నించే వారిపై దాడి చేస్తున్న బీఆర్ఎస్ రౌడీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు వచ్చే ఆదరణను చూసి జీర్ణించుకోలేక ఈ దాడులకు పాల్పడుతున్న విమర్శించారు. ఇప్పటికైనా దాడికి కారకులైనే వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విమర్శలకు ప్రతివిమర్శ చేయాలని కానీ హత్యాయత్నం చేయడం సమ్మతం కాదన్నారు. ప్రతి దాడికి దిగడానికి కాంగ్రెస్‌కు ఒక్క నిమిషం పట్టదని హెచ్చరించారు. పవన్ త్వరగా కోలుకోవాలని ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఆంజనేయనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన షటిల్ కోర్టు టోర్నమెంట్ విజేతలను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడల్లో నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు వివిధ వేదికల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. అందుకు తగ్గట్టుగానే క్రీడాకారులకు సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ప్రభాకర్, శ్యామ్, సుధాకర్ నిలిచారని నిర్వాహకులు తెలిపారు.

ఆత్మీయ సమావేశం

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరసింహ యాదవ్ నివాసంలో మంగళవారం కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం, నాయకులు వాజిద్ పాషా, పల్లపు వేణు, మొయినుద్దీన్, గిరిధర్, చిన్న మొయిజ్, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, బొందయ్య, చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో యాదుల్ ఆధ్వర్యంలో మంగళవారం మల్లారెడ్డి హాస్పిటల్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ శిరీష ప్రారంభించారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న మల్లారెడ్డి హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, రషీద్, సైదు పటేల్, మహబూబ్, భాస్కర్, లలిత, వహీద్, శ్రీనివాస్ చారి, సంతోష్‌కుమార్, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ రామారావునగర్‌లో సీసీరోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం శివాజీనగర్‌లో జరుగుతున్న రెడీమిక్స్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రావు, డివిజన్ కోఆర్డినేటర్ టి. వీరారెడ్డి, రాంరెడ్డి జ్ఞానేశ్వర్, మల్లేష్, ఇస్మాయిల్, సంజీవ, తేజారావు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని శ్రీ విఘ్నేశ్వర శివపార్వతి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సత్యం, నరసింహ యాదవ్, వాజీద్ పాషా, పల్లపు వేణు, మొయినుద్దీన్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

దోభీఘాట్‌లో వసతులు కల్పిస్తాం

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ దోభీఘాట్‌ను యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ మంగళవారం ఏఈ శివప్రకాష్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుల వృత్తినే నమ్ముకున్న రజకుల అవసరార్థం నూతన దోభీఘాట్, నీటి బోర్ అయ్యే అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్, చాగంటి అశోక్, వెంకటేష్, నాగభూషణం, మౌలానా, పెంటయ్య, భాస్కర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్‌లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల, ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు గోల్ఫ్‌లో సత్తా చాటారు. మహారాష్ట్రలోని కోర్గులో జరిగిన సౌత్‌జోన్ జాతీయ గోల్ఫ్ పోటీల్లో 14 మంది క్రీడాకారులు 14 మెడల్స్‌ను సాధించారు. మంగళవారం కళాశాలకు చేరుకున్న క్రీడాకారులను ప్రిన్సిపల్ పాపారావు సన్మానించారు.

దేశ భాషలందు తెలుగు లెస్స



బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: మాతృభాష దినోత్సవాని బబ్బుగూడలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మూసాపేట కార్పొరేటర్ మహేందర్ పాల్గొని మాట్లాడారు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీ కృష్ణ దేవరాయల మాటలను ఎప్పుడు మనస్సులో ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని భాషలు నేర్చుకున్నా మన మాతృభాషని మరువవద్దని తెలిపారు. ప్రస్తుత తరాలకు ఆదర్శంగా ఉండేలా మమ్మీ, డాడీ, అంకుల్ అనే పదాల కన్నా, అమ్మా, నాన్న, మామ, అత్త అనే పదాలు ఎంతో ఆప్యాయతను పెంచుతాయన్నారు. మన ఇళ్లల్లో కూడా మాతృభాషలోనే రోజూ మాట్లాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శాంత, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి, భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షుడు రమేష్ నాయర్, వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పెట్టకుండా ఫీజులు తీసుకోవాలి



రిజిస్ట్రార్ ప్రొ. మంజూర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో పరీక్షల ఫీజులు కళాశాలలోని బకాయిలతో సంబంధం లేకుండా కట్టించుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. మంజూర్ హుస్సేన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి టి. నాగరాజు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడారు. స్టూడెంట్స్ రిజిస్ట్రేషన్ ఫీజు పెండింగ్‌లో ఉన్నాయనే నెపంతో ఆయా కళాశాలల విద్యార్థుల పరీక్షల ఫీజులు కట్టించుకోవటం లేదన్నారు. బకాయిల పేరుతో విద్యార్థుల పరీక్ష ఫీజులు తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. రాజేష్ చౌహాన్, నాయకులు ఎం. రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డిజిటల్ పద్ధతిలో సైన్స్ టాలెంట్ టెస్ట్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఫోరం ఆఫ్ ఫిజికల్‌సైన్స్ టీచర్, ఎస్సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యాధికారి విజయ కుమారి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఆన్‌లైన్ డిజిటల్ పద్ధతిలో వినూత్నంగా నిర్వహించారు. అందులో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చగా జిల్లా పరిషత్ హైదర్‌నగర్ పాఠశాలకు చెందిన విజ్ఞాన్‌రెడ్డి మొదటి స్థానంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కీసరకు చెందిన రామ్‌చరణ్‌రెడ్డి రెండో స్థానం పొంది రాష్ట్ర స్థాయిలో జరిగే విజ్ఞాన ప్రతిభాపాటవాల పరీక్షకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ అధ్యక్షుడు అజయ్‌సింగ్, కోశాధికారి శ్రీనివాసచారి, జిల్లా ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భానూరి మధుసూదన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ బోనాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు నజీముద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఇంద్రాహిల్స్‌లో అర్ధరాత్రి సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో, కమల ప్రసన్న నగర్, వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్‌కాలనీ, మాధవరంనగర్ బీ,సీ బ్లాక్ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలని కాలనీల అసోసియేషన్ సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కాలనీల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. అదే విధంగా కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇంద్రాహిల్స్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రాహిల్స్‌కాలనీలో 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం అర్ధరాత్రి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్యనగర్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దశదిశను మార్చామన్నారు. అదే విధంగా ఇంద్రాహిల్స్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు వెంకట్‌నాయక్, రాందేవ్ రాథోడ్, రామారావు, ప్రసాద్, శ్యామ్, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు భాగ్యనగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. యల్లమ్మబండ ఫీడర్ పరిధిలోని మహంకాళీనగర్, శంషీగూడ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

◆ అదే విధంగా పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో జలవాయువిహార్, అడ్డగుట్ట, సమతానగర్‌లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వరదనీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: నందమూరినగర్ కాలనీలో జరుగుతున్న వరదనీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రధానంగా పైప్‌లైన్ పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యతా విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్ గిరి, హైదర్‌నగర్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, హైమద్ ఉన్నిస్సా తదితరులు పాల్గొన్నారు.

'నిథమ్'లో దస్తకారి హాత్ క్రాఫ్ట్ బజార్

రాయదుర్గం: నిథమ్‌లో మంగళవారం డైరెక్టర్ డాక్టర్ ఎస్ చిన్నంరెడ్డి జ్యోతి వెలిగించి దస్తకారిహాత్ క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభించారు. ఈనెల 28వ తేదీ వరకు రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. సందర్శకులకు ఉచిత ప్రవేశం. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలనే తపనతో క్రాఫ్ట్ బజార్‌ను నిథమ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయడానికి అనుమతించామన్నారు. కాగా సందర్శకుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇప్పటికే ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద లక్షలాది రూపాయలను లబ్ధిదారులకు అందజేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన ఎం. బాబు అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన 1 లక్ష 50 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నిజమైన లబ్ధిదారులకు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని ఆయన కోరారు.